నవతెలంగాణ
మెదక్
సోమవారం | 12 ఆగస్టు 2024 | www.navatelangana.com

మున్సిపాలిటీలో విలీనం దిశగా మల్లన్న సాగర్



నవతెలంగాణ-గజ్వేల్

మల్లన్న సాగర్ నిర్వాసితుల కాలనీ గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో విలీనం చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా కొనసాగుతున్న చర్చ విలీనమా, గ్రామపంచాయతీగా కొనసాగుతుందా అనేది త్వరలోనే ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో మల్లన్నసా గర్ ప్రాజెక్టు ముంపు గ్రామాలను గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పుర పాలికలో విలీనం చేస్తారా, ప్రత్యేక గ్రామపంచాయతీలుగా కొనసాగిస్తారా. అనేది చర్చనీయాంశమైంది. మున్సిపల్ పరిధిలో విలీనం చేయకుండా ఉండాలంటే ప్రస్తుతం మళ్ళీ ప్రత్యేక క్యాబినెట్ లేదా అసెంబ్లీ సమావేశం నిర్వహించి గ్రామపంచాయతీలుగా కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించాలి. ప్రస్తుతం మళ్లీ శాసనసభ సమావేశాలు పెట్టే అవకాశాలు కనిపించడం లేదు. అయితే మున్సిపల్ పరిధిలోని విలీనం చేసే అవకాశం ఎక్కువగా ఉందని ప్రచారం కొనసాగుతుంది. గత ప్రభుత్వం గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల మధ్య 50 టీఎంసీల సామర్థ్యంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టును నిర్మించింది. 14 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెప హాడ్, బంజేరుపల్లి, లక్ష్మాపూర్, వేములఘాట్, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి గ్రామాలను గజ్వేల్, ప్రజ్ఞా పూర్ పురపాలిక పరిధిలో సంగాపూర్, ముట్రాజ్పల్లి కాలనీల మధ్య దాదాపు 600 ఎకరాల్లో పునర్నిర్మించారు. 2020-21 నుంచి ముంపు గ్రామాల ప్రజలు ఇక్కడే నివాసం ఉంటున్నారు. 15 వేలకు పైగా జనాభా ఇక్కడ ఉంది. మొన్నటి వరకు గ్రామ పంచాయతీలను తాత్కాలిక ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలతో పాలన కొనసాగిస్తోంది. భౌగోళికంగా ఈ కాలనీలు గజ్వేల్ మండల రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. ఇక్కడి నాయకులు, ప్రజలు మాత్రం తమ గ్రామపంచాయతీలను కొనసాగించాలని కోరుతున్నారు. ప్రస్తుతం గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పురపాలికలో 20 వార్డులున్నాయి. 55 వేల జనాభా ఉంది. దాదాపు 32 వేల ఓటర్లున్నారు. ముంపు గ్రామాలను కలిపితే దాదాపు మరో 10 వార్డులు అదనంగా పెరిగి 30 వార్డులవుతాయి. రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. ముంపు గ్రామాల జనాభా, ఓటర్ల వివరాలతో కూడిన నివేదికను గతంలోనే ప్రభుత్వానికి పంపించామని ఎలా ముందుకెళ్లాలనే దానిపై ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తరువాత వెల్లడిస్తా రెవెన్యూ అధికారులు అంటున్నారు.

మద్యం మత్తులో మర్కూక్

- గ్రామాల్లో జోరుగా బెల్టు షాపులు
- 24 గంటలు అందుబాటులో లిక్కర్
- ఏరులై పారుతున్న మద్యం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- చోద్యం చూస్తున్న అబ్కారి శాఖ



నవతెలంగాణ-మర్కూక్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో మర్కూక్ మండల పరిధిలోని 16 గ్రామాలున్నాయి. వీటిలో మాజీ సిఎం దత్తత గ్రామమైన నర్సన్నపేట గ్రామం మద్య రహిత గ్రామం. దీంతో మద్యం దోపిడి షురువైంది. 15 గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపుల నిర్వహణతో 24 గంటల పాటు మందు అందుబాటులో ఉంటుంది. అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతున్నది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం పాలసీకి వ్యతిరేకంగా.. మర్కూక్ మండలలోని గ్రామాల్లో గల్లీ గల్లీలో రేయింబవళ్ల మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు నోరు మెదపకపోవడంతో ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తూ.. మద్యం ప్రియుల జేబులకు చిల్లు కొడుతూ బెల్టు షాపుల నిర్వాహకుల అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరుకాయాలుగా యథేచ్ఛగా కొనసాగుతున్నది. అధికారికంగా మద్యం దుకాణాలను పొందిన వారే గ్రామాలకు మద్యాన్ని సరఫరా చేసి.. బెల్టు షాపుల నిర్వాహకుల ద్వారా విక్రయించి, అధిక లాభాలను గడిస్తున్నారు. వైన్స్ షాపు నుంచే గ్రామాలకు మద్యం సరఫరా అవుతుంది. బెల్టు షాపు నిర్వాహకుడి నుంచి ఎంఆర్‌పీ ధరకంటే అధనంగా డబ్బులు తీసుకుని ఎవరైనా వస్తే తాము చూసుకుంటామని మీరు నిశ్చింతగా మద్యం విక్రయాలు నిర్వహించాలని భరోసానిస్తున్నట్లు సమాచారం. బెల్టు షాపు నిర్వాహకులు ఆటోలలో... ద్విచక్ర వాహనాలపై మద్యం బాటిళ్లను బహిరంగంగానే తీసుకెళ్తున్నారు.

అధికారుల అండదండలు

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాల నిర్వహణ గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటు యధేచ్ఛగా కొనసాగుతుండడంపై ఎక్సైజ్ అధికారుల, పోలీసుల అండదండలు నిర్వాహకులకు ఉన్నట్లుగా తెలుస్తోంది. గ్రామంలోనే బెల్టు దుకాణాలు24 గంటలు నడుస్తున్నాయి. ఒక్కో గ్రామంలో సుమారుగా 8 నుంచి 11 వరకు బెల్టు షాపులు ఉన్నాయంటే అధికారుల అలసత్వం ఏపాటిదో తెలుస్తోంది.

వైన్స్ షాపుల ఉన్నా.. బెల్టు షాపు తప్పనిసరి

ప్రభుత్వం నిర్ణయించిన మద్యం దుకాణాలు ఉన్నచోట్లలోనూ బెల్టుషాపుల నిర్వహణ తప్పనిసరిగా మారింది. వైన్స్ షాపుల నిర్వహణ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించాల్సి ఉంటుంది. వైన్సు షాపులు మూసేసిన తర్వాత కూడా బెల్టు షాపు రూపంలో మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎంఆర్‌పీ ధర కంటే అదనంగా క్వాటర్ బాటిల్‌పై రూ.40 నుంచి రూ.50 వరకు, బీరు బాటిల్‌పై అదనంగా రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. మద్యం ప్రియులు సైతం చేసేదిలేక అధిక ధరలకు మద్యాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు

ఏడ పడితే ఆడ.. తాగినోళ్లకు తాగినంత.. గ్రామాలలో మందు మస్తుగా దొరుకుతున్నది. ఏ ఊర్లో చూసినా, ఏ సందులో చూసినా బెల్టుషాపులు పుట్టగొడుగులెక్క వెలుస్తున్నయ్. పొద్దుమాపు తేడా లేకుండా వాటిని ఖుల్లా పెడ్తున్నరు. జనం తిప్పలు పడుతున్నా అదేం పట్టనట్టుగా సర్కారు ఎక్సైజ్ శాఖ గల్లీ గల్లీకి బెల్టుషాపులను ప్రోత్సహించడంతో ప్రతి ఊరిలో సగటున పదికిపైగానే బెల్టుషాపులు రన్ అవుతున్నయ్. కిరాణా షాపుల్లోనూ కావాల్సిన లిక్కర్ బ్రాండ్స్ దొరుకుతున్నయ్. కొన్ని చోట్ల తాగాలనుకున్నోళ్ల ఫోన్ కొట్టడమే ఆలస్యం, బెల్టుషాపుల నుంచే డోర్ డెలివరీలు చేస్తున్నారు.



రోడ్డున పడుతున్న కుటుంబాలు

మద్యానికి బానిసైన వారు ఇంట్లో ఏ వస్తువు ఉంటే అది అమ్మి మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవకు దిగుతున్నారు. కుటుంబ కలహాలతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి, బెల్టు షాపులు నడవ కుండా అడ్డుకట్ట వేయాలను ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేసి చర్యలు చేపడుతాం

అబ్కారి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి

గ్రామాలలో బెల్టు షాపులలో అమ్మితున్న విషయం తమ దృష్టి రాలేదని, బెల్టు షాపులలో మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవు. బెల్టు షాపులపై రైడింగ్ నిర్వహించి, కేసులు పెట్టి శాఖ పరమైన చర్యలు తీసుకుటాం.

ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి ఇంటి నుంచి గెంటేశారు

అత్త, మామ, భర్త వేధింపులు
ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన కథనం



నవతెలంగాణ-నిజాంపేట

ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి అత్త మామ భర్త ఇంటిలో నుంచి రాత్రి బయటకు గెంటివేసిన సంఘటన నార్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు సంగు పరుశురాంలు, సంగు సుజాతలు ఇద్దరు ఒకరినొకరి మనసులు కలవడంతో దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం కలిగారు. కొడుకు 6 సంవత్సరాలు, కూతురు 2 సంవత్సరాలు ఉన్నారు. ఇద్దరూ నార్లాపూర్ గ్రామానికి చెందిన వారే ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత అత్త, మామ, భర్త, కలిసి తనను రాత్రి 8 గంటలకు ఇంటిలో నుంచి బయటకు గెంటేసారని సుజాత ఆవేదనతో తెలిపారు. తల్లిగారి ఇంటికి వెళదామంటే అక్కడ బాధలు, అత్తవారి ఇంటి వద్ద ఇక్కడ బాధలు ఎక్కడికి వెళ్లాలో తెలియక అత్తగారి ఇంటి ముందరినే బయట రోడ్డుపైనే బైఠాయించారు. పిల్లలు చలిలో వణుకుతూ ఏడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఏ ఒక్క నాయకుడు కూడా పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. మానవత్వం ఉన్న ఏ ఒక్క మనిషి నార్లాపూర్‌లో కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు . అధికారులు స్పందించి వెంటనే బాధితురాలికి తగు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్‌ని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం, ఒకరు మృతి



నవతెలంగాణ -ములుగు

బైకుని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తూరు హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గర జరిగింది. మేడ్చల్ జిల్లా వెంకట్రాంరెడ్డి కాలనీకి చెందిన గగనం ప్రేమ్ (24) సోమరం గ్రామంలోని మేడ్ ఫ్లస్ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన తన స్నేహితుడి ఇంటికి వెళ్లి రాత్రి 8:30 నిమిషాలకు కొత్తూరు నుంచి బండమైలారం వెళ్తుండగా, మార్గమధ్యలో హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గర వెనక నుంచి గుర్తు తెలియని వాహనం వచ్చి బైక్‌ని ఢీకొట్టడంతో ప్రేమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణ పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

పారిశుద్ధ్య నిర్వహణ పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతమైందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారుల సహకారంతో అధికారులు, సిబ్బంది గ్రామ ప్రజలతో జిల్లాలోని 469 గ్రామపంచాయతీలలో ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఐదు రోజులపాటు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు మహిళా యువజన సంఘాలు వార్డ్ కమిటీల సభ్యులతో ర్యాలీలు సమావేశాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. పారిశుద్ధ్యం మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, ప్లాస్టిక్ వాడటం వల్ల జరిగే దుష్ప్రభావాలు వంటి అంశాలపై ప్రజల్లో గ్రామస్తులు అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు అంగన్వాడీలు వసతి గృహాలు, బస్టాపులలో పారిశుద్ధ పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం విజయవంతం చేయాలన్నారు. తాగునీరు, వర్షపు నీటి సంరక్షణ, మురుగు గుంతల పూడ్చివేత, తాగునీటి వనరుల శుభ్రత, క్లోరినేషన్, ఇంకుడు గుంతల ఏర్పాటు, తదితర అంశాలపై గ్రామస్తులలో అవగాహన కల్పించడం, సీజనల్ వ్యాధులపై ప్రచార కార్యక్రమాలు సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో ఇంటెన్సివ్ క్లీనింగ్ యాంటీ లార్వా ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టడం జరిగింది. ప్రతి ఇంటికి మునగా, కరివేపాకు, మామిడి, ఉసిరి నేరేడు చింత దానిమ్మ వంటి పళ్ళు, ఔషధ గుణాలున్న మొక్కలను పంపిణి చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతనం పచ్చదనం నిర్వహించి రహదారులను శుభ్రం చేయడం జరిగిందని మురుగు కాలువను శుభ్రం చేయడం జరిగిందని, ప్రజా మరుగుదొడ్లను శుభ్రం చేయడం జరిగిందని, 293287 ప్రజలను భాగ్యసాములు చేస్తూ శ్రమదాన కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి తొలగించడం జరిగిందన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా గృహాలలో పరిశుభ్రం చేయడం,వన మహోత్సవంలో భాగంగా 2 లక్షల మొక్కలను నాటడం జరిగిందని తెలిపారు.

యువజన కాంగ్రెస్ అభ్యర్థిగా సంగమేశ్వర్‌ను గెలిపించండి



నవతెలంగాణ-పుల్కల్

ఉమ్మడి పుల్కల్ మండల యువజన కాంగ్రెస్ అభ్యర్థిగా గండ్ల సంగమేశ్వర్‌ను గెలిపించాలని సీడీఆర్ యువసే ఉమ్మడి మండలాధ్యక్షులు గాండ్ల విక్రం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆశీర్వాదంతో తన సోదరుడైన విక్రం యువజన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచాడన్నారు. చదువుకున్న యువతీ యువకులు భారీ సంఖ్యలో ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాము గెలిచాక అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-జోగిపేట, న్యాల్కల్

జోగిపేట మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. ఆదివారం సాయంత్రం నమ్మదగిన సమాచారం మేరకు పట్లోళ్ల మల్లప్ప ఇంట్లో పేకాట ఆడుతుండగా.. పోలీసులు దాడి చేశారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న మల్లప్ప, వినోద్ కుమార్, సంగమేశ్వర్ , శివశంకర్, మల్లేష్, రాజయ్యలను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద రూ.1800, పేకముక్కలు స్వాధీనం చేసుకుని.. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

న్యాల్కల్ మండలంలోని హద్నూర్, వడ్డీ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నరన్న నమ్మదగిన సాచారంతో పోలీసులు దాడి చేసి 13 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద రూ.22,550 నగదు పట్టుకున్నట్టు ఎస్సై రామునాయుడు తెలిపారు. పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డు వేతనం ఇవ్వాలి

- ఆశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్ విధానం రద్దు చేయాలి
- సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి
- సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్ స్వామి డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఆశాలకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలను వెంటనే రద్దు చేయాలని వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల్ స్వామి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారన్నారు. ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఇచ్చిన హామీలు నేటికీ అమలు కావడం లేదని విమర్శించారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని వేసిన కమిటీ ఆశాల సమస్యలు అన్ని అంశాలు అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఆశా వర్కర్ల సమస్యలపైన నివేదికను అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వీటితోపాటు పెండింగ్ పిఆర్సి ఎరియర్స్, కరోనా రిస్క్ అలవెన్స్ ఇచ్చే విధంగా చూస్తామని, సమ్మె కాలం వేతనాలు చెల్లిస్తామని, ఇతర పెండింగ్ బిల్లులు కూడా చెల్లిస్తామని హామీనిచ్చారని, వీటితో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీనిచ్చిందని వాటినీ ఏ ఒక్కటి కూడా అమలు చేయడం లేదన్నారు. అప్పటి కమీషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, మట్టి ఖర్చులు రూ.50 వేలు ఇస్తామని, రిజిస్టర్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని పై అంశాల్లో ఒక్క సమ్మెకాలం వేతనాలు మాత్రమే ప్రభుత్వం చెల్లించి. ఇతర సమస్యలు నేటికీ పరిష్కారం చేయలేదని మండిపడ్డారు. ఆశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్ పెట్టే నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఇప్పటివరకు అనేకసార్లు ఆరోగ్య శాఖామంత్రి, ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులకు అనేక విజ్ఞప్తులు తెలియజేశామని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిష్కారం చేయకపోవడం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని లేని ఎడల ఆందోళన, పోరాటాలు ఉధృతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డు బర్ల భాస్కర్, శ్రామిక మహిళ కన్వీనర్ ఏం.పద్మ ఆశా వర్కర్లుయూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంజుల, బి.ప్రవీణ, భాగ్యలక్ష్మి, మంజుల, బాలమణి, రజిత, శారద, వరలక్ష్మి, సంతోష, లక్ష్మీ, రమణ, స్వరూప, లత, వసుందర, శోభ, మణెమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

- పదివేల పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలి
- టీపీటీఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్జీజీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని.. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి డీఈడీతో పాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఆర్థికశాఖ వద్ద పెండింగ్లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలుగా ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్సీ కమిటీ నివేదికను తెప్పించుకొని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలని, భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలని కోరారు. మాడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేయాలి. 010 ద్వారా వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యా యులు, సిబ్బందికి కనీసం మూలవేతనం చెల్లించాలని అన్నారు. మహిళా ఉపాధ్యాయుల మాదిరిగా 27 సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులర్ చేసి అందరికీ మినిమం టైం స్కేల్స్‌ను వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలను స్వాధీనం చేసుకొని 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. 317 జీవో ద్వారా మ్యూచ్‌వల్ బదిలీ చేయబడిన ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలన్నారు. 317 జీవోలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు, పెండింగ్‌లో ఉన్న 13 జిల్లాల స్పౌజ్ కేటగిరి ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొండ పోచమ్మ ప్రాజెక్టులోకి నీళ్లు

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



నవతెలంగాణ-మర్కూక్

వర్షాభావ పరిస్థితుల నేపథ్యం లో సాగుకు నీరందిస్తారని వేచిచూ స్తున్న రైతులకు కొండపోచమ్మ సాగర్‌లోకి నీటిని గత మూడు రోజు లుగా ఎత్తిపోస్తుండ డంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో హైద్రాబాదు పరిసర ప్రాంతాల యువత, కుటుంబ సభ్యులు, చూట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు సందర్శించారు.

సగరులు రాజకీయంగా చైతన్యవంతం కావాలి

- సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర



నవతెలంగాణ-పాపన్న పేట

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా సగరులు రాజకీయ చైతన్యం కావాల్సిన అవసరం ఉందని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ మాత ఆలయ సమీపంలో జరిగిన జిల్లా సగర సంఘం ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే గ్రామపంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలలో సగరులు చైతన్యాన్ని ప్రదర్శించి రాజకీయంగా ఎదగాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సగరులకు సముచిత స్థానం కల్పించే రాజకీయ పార్టీలను ఆదరిస్తామని, సగరులను రాజకీయంగా విస్మరించే రాజకీయ పార్టీలను ఓడించడానికి ఏకమవుతామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సగరులను మరింత చైతన్యవంతులను చేసే క్రమంలో అన్ని జిల్లాలలో పాలకవర్గాలను నూతనంగా ఏర్పాటు చేసి సంఘాన్ని పటిష్టపరిచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కు దత్తాత్రేయ, కార్యనిర్వాహక కార్యదర్శి బంగారి ఆంజనేయులు, రాష్ట్ర సగర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పరి మహేందర్ , రాష్ట్ర నాయకులు రవీందర్, శ్రీకాంత్, పోచయ్య , జిల్లా కోశాధికారి సంధిల సాయిలు , మాజీ జిల్లా అధ్యక్షులు ఓంకార్ , జిల్లాలోని దాదాపు 60 గ్రామాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా సగర సంఘం నూతన కమిటీ

మెదక్ జిల్లా సగర సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.జిల్లా అధ్యక్షులుగా సందిల సాయిలు , ప్రధాన కార్యదర్శిగా మర్కు నగేష్, కోశాధికారిగా బాలకృష్ణ నియామకం అయ్యారు.

జిల్లా యువజన సంఘం

జిల్లా సగర యువజన సంఘం అధ్యక్షులుగా ఉప్పరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా వగ్గు శ్రీకాంత్, కోశాధికారిగా ఉప్పరి సాయిలు నియమితులయ్యారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట నేడు ధర్నా

- పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలి
- సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు మహిపాల్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు(సోమవారం) మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించను న్నట్టు సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు మహిపాల్ తెలిపారు. స్థానిక శ్రామిక్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీబాటలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఏ వార్డులో, ఏ గల్లీలో చూసినా రోడ్లు బాలేవని.. మురికి కాలువలు అధ్వాన్నంగా మారాయన్నారు. వాటన్నింటికీ నిధులు ప్రభుత్వంల నిధులు కేటాయించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇలాంటి ఎన్నో సమస్యలకు వెంటనే పరిష్కారాలను చూపాలని కోరుతూ నేటి ధర్నా ఉంటుందన్నారు. కాబట్టి పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో సీపీఐ(ఎం) నాయకులు సలీమొద్దిన్, తిరుపతి, నరేష్, బక్కన్న, శాంతమ్మ రాజు తదితరులున్నారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- రైతు రుణమాఫీ తక్షణమే చేపట్టాలి
- బ్రోకర్లు లేకుండా కొత్త పంటలకు రుణాలివ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలో ఉన్న భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సీపీఐ(ఎం) సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ వెంటనే చేసి కొత్త రుణాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు లక్షల లోపు ఉన్న రైతు రుణాలను ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని కోరారు. రుణాలు మాఫీ అయినా రైతులకు బ్రోకర్ల ప్రమేయం లేకుండా బ్యాంకులు తిరిగి పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో ఉన్న ధరణి భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసైన్మెంట్ భూములకు పట్టా సర్టిఫికెట్లు, కొత్త పాస్ పుస్తకాలు వెంటనే ఇవ్వాలన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం. నరసింహులు, మండల కార్యదర్శి రాజయ్య, మండల నాయకులు బాబురావు, మైపాల్‌రెడ్డి, అమృతమ్మ పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు



నవతెలంగాణ-టేక్మాల్

వృద్ధురాలిని హత్య చేసి పరారైన నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు అల్లాదుర్గం సీఐ రేణుక వెల్లడించారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కాదులూరు గ్రామ శివారులో దత్తాత్రేయ ఆశ్రమంలో కాదులూరు గ్రామానికి చెందిన అంజమ్మ గత కొంతకాలంగా నివాసం ఏర్పరచుకొని ఉంటుంది. ఆగస్టు 7వ తేదిన రాత్రి ఆశ్రమంలోని గుడిసెలో ఉంటున్న వృద్ధురాలిని అదే గ్రామానికి చెందిన శివకుమార్ హత్య చేసి పరారయ్యాడు. ఈ మేరకు మృతురాలి అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. హత్య చేసి పరారైన నిందితుడి కోసం మూడు బృందాలను ఏర్పాటు చేసి నిందితుడు శివ కుమార్‌ను జోగిపేటలో అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు. ఆశ్రమంలోని పూరిగుడిసెలో నిద్రిస్తున్న వృద్ధురాలి వద్ద ఉండే పెన్షన్ డబ్బులను, బంగారం దొంగలించేందుకు ప్రయత్నించగా వృద్ధురాలు, నేరస్తున్ని చూసి గుర్తించి, కేకలు వేయగా, కేకలు బయటకు వినిపించకుండ శ్వాస ఆడకుండ ముక్కు నోరు మూసి, గొంతు నొక్కడంతో వృద్ధురాలు ఊపిరాడక చనిపోయిందని గుర్తించిన నిందితుడు బంగారు గుండ్లను తీసుకొని పారిపోయినట్లు విచారణలో తేలిందని సీఐ వెల్లడించారు. ఆదివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు అల్లాదుర్గం సీఐ తెలిపారు. హత్య కేసును చేదించడంలో భాగస్వాములైన టేక్మాల్ పోలీస్ సిబ్బందిని సిఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్, టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని బీసీ కాలనీలో రేణుక ఎల్లమ్మ ఆలయం, పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున కౌన్సిలర్ గోపాలమ్మ వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మున్సిపల్ యువజన నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఘనంగా ఉత్సవాలను నిర్వహించిన కౌన్సిలర్ గోపాలమ్మ వెంకటయ్యను, ఆలయ నిర్వాహకులు, కాలనీ వాసులు అభినందించారు. ప్రతీ ఒక్కరు దైవారాధన కలిగి ఉండాలని ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కౌన్సిలర్ గోపాలమ్మను, నాయకులు ప్రవీణ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు విశ్వనాథ్, శ్రీను, స్వామి, శేఖర్, బీరప్ప, భాను, శ్రీనివాస్, వెంకటేష్ , కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-జిన్నారం



యువతరం స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, జిన్నారం మాజీ ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్‌లు అన్నారు. మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామంలో ఆదివారం నూతన స్వీట్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. యువతరం నేడు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీ జనాభాయి,మాజీ సర్పంచ్ ఎంపీ అశోక్, వావిలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ ఎంపీ మాణిక్ రావు, ఎస్ఎంఆర్ యువసేన ప్రతినిధి కాంగ్రెస్ పార్టీ యువనేత జిన్నారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట ప్రధాన రహదారిపై వెలగని వీధి లైట్లు

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ నియోజకవర్గ కేంద్రమైన అందోల్-జోగిపేట మున్సిపల్ ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్లకు లైట్లు వెలగట్లేదు. అందోల్ అంబేద్కర్ చౌరస్తా నుంచి జోగిపేట మీదుగా భారత్ పెట్రోల్ పంపు వరకు డివైడర్‌పై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. అవి మధ్య మధ్యలో ఒకటి రెండు మాత్రమే వెలగడంతో ఆ దారి మొత్తం చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అంత్యక్రియలకు వీవీఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని వెంకట్‌రెడ్డినగర్‌లో నివసించే రంగమ్మ వయోభారంతో ఆదివారం మృతి చెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ యువజన నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వీవీ.ఆర్ ఫౌండేషన్ తరఫున మృతురాలి అంత్యక్రియల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పేద కుటుంబానికి అండగా నిలిచిన ఫౌండేషన్ సభ్యులకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వెంకీ, రమేష్, కృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



వాహనదారులందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

నవతెలంగాణ-మునిపల్లి

వాహనదారులందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్ఐ రాజేష్ నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించి.. 8 మందిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశాలతో.. వాహనాల తనిఖీ నిర్వహించినట్టు చెప్పారు. కాగా మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు చర్యలు తప్పవన్నారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.



అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మండలంలోని మాద్వార్ గ్రామానికి చెందిన కొవ్వూరి లక్ష్మయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకుని.. గుజ్జపు మచ్చేందర్ ఫౌండేషన్ ఫౌండేషన్ ద్వారా మృతుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జపు మచ్చేందర్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, అభి పవర్, అనుముల తుకారాం, సంతోష్ నాయక్, మద్వార్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈశ్వర్ గౌడ్, నర్సింలు, పెద్దరామయ్య ఈశ్వర్, చిన్న రామయ్య తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన రాజేష్

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

బోరంచ గ్రామానికి చెందిన బైండ్ల బుజ్జమ్మ, నరసయ్య దంపతుల కుమారుడి వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకలో స్ట్రీట్ చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్ అనిల్ మౌర్య, మనూరు మండల్ యూత్ కాంగ్రెస్ లీడర్ ఆనంద్ రిపోర్టర్ దుమ్మరాజు, శ్రీను, సునీల్, సంగమేష్ పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు బుద్ధుడి చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు.

వీరభద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-గుమ్మడిదల

శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెం, వీరభద్ర స్వామి ఆలయాలకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు పదివేల మంది భక్తులు హాజరైనట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఉప్పల శశిధర్ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నదాన సంతర్పణ కార్యక్రమాలతో పాటు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా సీనియర్ అసిస్టెంట్ సోమయ్య సిబ్బందిని పర్యవేక్షించారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు తదితరులున్నారు.

ఆదర్శ గురువు..

ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేస్తున్న ప్రవీణ్‌కుమార్



'విధి నిర్వహణకు మించిన దేశ సేవ లేదు' అనే మహాత్మా గాంధీ మాటలను నిజం చేస్తూ ఓ ఉపాధ్యాయుడు 'ఆదర్శ గురువు'గా పేరు సంపాదించాడు. ఉపాధ్యాయుడు అంటే కేవలం బోధన మాత్రమే కాదని నిరూపిస్తూ.. తాను పనిచేస్తున్న పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎనలేని కృషి చేస్తున్నాడు. సొంత డబ్బులు, దాతల సాయంతో పాఠశాలలను అభివృద్ధి చేసి.. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కష్టపడుతున్నాడు. ఆ కష్టానికి తగ్గట్టుగానే.. సదరు పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల్లో జిల్లా స్థాయిలో ఆ విద్యార్థులు అవార్డులు గెల్చుకోవడమే అందుకు నిదర్శనం. నేటి 'మనీ' ప్రపంచంలోనూ కేవలం జీతం కోసం పనిచేయకుండా.. విధి నిర్వాహణే దేశ సేవగా ముందుకు సాగుతూ ఎన్నో అవార్డులు.. ఎన్నెన్నో ప్రశంసలు.. మరెన్నో సత్కారాలు పొందుతున్న ప్రవీణ్‌కుమార్ సారుపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

- విధి నిర్వాహణకు మించిన దేశ సేవ లేదనే మహాత్ముడి మాటలతో ముందుకు
- సొంత డబ్బుతో పాఠశాలల్లో సౌకర్యాలకు కృషి
- ఎన్నో సత్కారాలు.. ఎన్నెన్నో అవార్డులు.. మరెన్నో ప్రశంసలు
- నవతెలంగాణ ప్రత్యేక కథనం

నవతెలంగాణ-మునిపల్లి

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ 2012లో మునిపల్లి మండలంలోని చీలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయు డిగా నియామకమయ్యారు. అది మారుమూల గ్రామమైన ప్పటికీ.. ఆ పాఠశాల అభివృద్ధి కోసం ఆయన ఎన్నో నూతన ప్రణాళికను అమలు చేశారు. ఎంతో కష్టపడి పాఠశాలను అభివృద్ధి చేశారు. దాంతో అప్పట్లో వైజ్ఞానిక ప్రదర్శనలో చీలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఎంపికైంది. ఈ ఉత్తమ ప్రతిభలో ప్రవీణ్‌కుమార్ కీలక పాత్ర పోషించారు.

గ్రామ, మండల ప్రజాప్రతినిధులను ఐక్యం చేస్తూ పాఠశాలలో అనేక కార్యక్రమాలను నిర్వహించేవారు. ప్రతీ మహనీయుడి జయంతిని పాఠశాలల్లో జరపడం ద్వారా విద్యార్థుల్లో సమైక్యత, జాతీయభావం పెంపొందించేందుకు ప్రయత్నించారు. అదేవిధంగా పాఠశాలలో ప్రతి ఏటా జాతీయ జర్నలిస్టుల దినోత్సవం నిర్వహించి మండలంలోని జర్నలిస్టులందరిని సన్మానించేవారు. ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలను చేపట్టడంతో అందరూ ఆయన్ను అభినందించడమే కాకుండా.. పాఠశాలల అభివృద్ధికి తమవంతు సాయం అందజేసేవారు.

వలస కార్మికుల పిల్లలకు చదవు అందేలా కృషి..

గ్రామానికి వచ్చే వలస కార్మికుల పిల్లలు విద్యకు దూరంగా ఉండకూడదనే ఉద్దేశంతో.. ఆ పిల్లలను బడిలో చేర్పించేవారు. ఆయన సొంత నిధులతో రాత పుస్తకాలు, పలకలు అందించి వారికి విద్యను అందజేసేవారు. ఆయన చేసిన ఈ సేవను గుర్తించి.. జిల్లా స్థాయిలో ఆయనకు ప్రశంసలు అందాయి. కాగా చీలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన చేసిన సేవలకు గాను జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కూడా లభించింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ద్వారా ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డును సైతం ప్రవీణ్‌కుమార్ అందుకున్నారు. ఇవేకాకుండా అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రవీణ్‌కుమార్ చేసిన సేవలను గుర్తించి అనేక అవార్డులు, రివార్డులు ఇచ్చి సత్కరించాయి.



జిల్లాస్థాయి ఉత్తమ వైజ్ఞానిక ప్రదర్శన అవార్డు..



వలస కార్మికుల పిల్లలను బడిలో చేర్పిస్తూ..

మూతబడిన పాఠశాలకు పూర్వవైభవం..

మునిపల్లి మండలంలోని మల్లారెడ్డిపేట పాఠశాల అప్పట్లో కొన్ని కారణాలవల్ల విద్యార్థులు లేక మూతపడింది. దీంతో అప్పట్లో విద్యార్థులంతా సమీపంలోని మల్లికార్జు నపల్లి ప్రాథమిక పాఠశాలకు వెళ్లేవారు. అయితే వర్షాకాలంలో వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవడంతో.. మల్లారెడ్డిపేట పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలను తెరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రుల ంతా ధర్నా చేశారు. దాంతో విద్యార్థులు లేని మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలకు ప్రవీణ్‌కుమార్‌ను సర్దుబాటు చేశారు. అయితే ఈ పాఠశాలకు పూర్వవైభవం తేవడంలో ప్రవీణ్ కుమార్ ఎనలేని సేవ చేశారు. గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులను విద్యావం తులను ఏకం చేస్తూ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్య తను వివరించారు. దాంతో అనేకమంది పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చారు. మంజీరా రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్, అప్పటి సర్పంచ్ శివలీల ఉప సర్పంచ్ రాజుతో పాటు అనేకమంది ముందుకు వచ్చి పాఠశాలలో అభివృద్ధికి కృషి చేశారు. కొందరు విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ విరాళామందించగా మరికొందరు బూట్లను పంపిణీ చేశారు. అంతేకాకుండా మైక్‌సెట్ లాంటవి కూడా పాఠశాలకు విరాళంగా అందించారు. ప్రహరీ గోడకు గేటును సైతం దాతల సహకారంతో చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టడంతో పాఠశాల కొత్త శోభను సంతరించుకున్నది. విద్యార్థులేని పాఠశాలను 20 మంది విద్యార్థులకు చేర్చి.. ఏడాది కాలం పాటు కాలం ఆదర్శవంతంగా నడిపించారు. విద్యార్థులు లేరనే కారణంతో రద్దయిన ఉపాధ్యాయ పోస్టు.. ప్రవీణ్ కుమార్ చొరవ వల్ల తిరిగి పునరుద్ధరించబడింది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడు వచ్చారు. దాంతో గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పట్ల తల్లిదండ్రులకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది. ప్రస్తుతం ప్రవీణ్ కుమార్ సదాశివపేట మండలం నాగులపల్లికి బదిలీ పై వెళ్లారు.

ప్రవీణ్‌కుమార్ కృషి ఎనలేనిది



మండలంలో విద్యార్థులు లేక మూత పడిన మల్లారెడ్డిపేట పాఠశాలను తిరిగి పూర్వ వైభవం తేవడానికి ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ చేసిన కృషి ఎనలేనిది. ప్రభుత్వ పాఠశాలల ఔన్నత్యాన్ని కాపాడిన ప్రవీణ్ కుమార్‌కు అభినందనలు.

-దశరథ్, మండల విద్యాధికారి

ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

- సెలవు దినాల్లో యథేచ్ఛగా తవ్వకాలు.. తరలింపు
- పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం..
- వెంటనే అక్రమ తవ్వకాలు అడ్డుకోవాలి : స్థానికులు

నవతెలంగాణ-పుల్కల్



పుల్కల్ మండల పరిధిలోని బస్వాపురం గ్రామ శివారులో ఉన్న ఇరిగేషన్ భూమిలో నుంచి కొందరు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా మట్టిని మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జేసీబీలు పెట్టి ట్రాక్టర్ల సాయంతో యథేచ్ఛగా దందా చేస్తున్నారు. సెలవు దినాల్లో ఈ దందా ట్రాక్టర్లు ఆరు ట్రిప్పులు అన్న చందంగా నడుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. సదరు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాజాగా రెండో శనివారం, ఆదివారం రెండ్రోజులు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుదినాలు కావడంతో ఈ మట్టి దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. సుమారు 200 ట్రిప్పుల మట్టిని ట్రాక్టర్లతో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు యథేచ్ఛగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీల సాయంతో మట్టిని తొవ్వి.. ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ ప్రభుత్వ భూములను గుల్ల చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా తహసీల్దార్ గానీ, ఆర్డీఓ గానీ కనీసం చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. వారికి మామూళ్లు అందుతాయి కాబట్టే.. చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. పేదల ఇంటి బరంతి కోసం ఒక్క ట్రిప్పు తీసుకెళ్లినా.. అనుమతులు లేవని, చట్టాల ఉల్లంఘన జరిగిందంటూ కేసులు పెడుతున్నారని.. అలాంటిది యథేచ్ఛగా దందా జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. మరోపక్క శనివారం రోజున ఘటనా స్థలానికి విలేకర్లు వెళ్లి మట్టి తరలింపుపై ప్రశ్నించగా.. తమకు అన్ని విధాల అనుమతులు ఉన్నాయని.. మీరెవరు అడగటానికి అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడడం గమనార్హం. ఇదే విషయమై స్థానిక విలేకరులు పుల్కల్ తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.



పంచముఖ హనుమాన్ మందిర నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని కృష్ణనగర్‌కాలనీలో గల శ్రీ పంచముఖ హనుమాన్ మందిర నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా నెమలికొండ వేణు మాధవ్, అధ్యక్షులుగా గురువుల నాగరాజ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా సంఘన్న, బామిని రవి, బోయిని జగదీష్ , కోశాధికారిగా బుస శేఖర్, మంచిగారి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ కార్యదర్శి రాజు, కొత్త రమేష్, గుండు బిక్షపతిలు ఎన్నికయ్యారు.

ఘనంగా దిశెట్టి పాటిల్ కుమారుల దోతీ కార్యక్రమం

పాల్గొన్న ఎమ్మెల్యే, వివిధ పార్టీల నాయకులు

నవతెలంగాణ-జహీరాబాద్



జెకె కన్స్ట్రక్షన్ అధినేత దిశెట్టి పాటిల్ కుమారుల దోతీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాణిక్‌రావుతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. పట్టణంలోని శుభం కన్వెన్షన్ కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన పుట్టు పంచల కార్యక్రమానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు తన అనుచరులతో పాల్గొని.. బొమ్మ జస్వంత్, కుమార్ బొమ్మ మహేందర్‌లను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, ప్రముఖ న్యాయవాది పాండు రంగారెడ్డి, హనుమాన్ జవిత్, ఇస్తేకార్, ఉమర్ అహ్మద్, సాల్మన్, ప్రవీణ్, నామ రవి కిరణ్ బేసిగం సతీష్, మోతిరామ్, రాములు నేత, జాంగిర్ అబ్దుల్లా, యూనుస్, చంద్రశేఖర్ స్వామి, వీరేష్ మడపతి, రవికాంత్, భాస్కర్ యాదవ్, ముస్తక్, జాకీర్, రమ్య సుధా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మెరుగైన మార్పుల కోసం కృషి చేయాలి





నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

సమాజంలో మెరుగైన మార్పుల కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని స్థానిక గవర్నమెంట్ స్కూల్‌ను ఆదివారం ఆదివారం సందర్శించారు. బెస్ట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లోని మూడు పాఠశాలలకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం కోసం గవర్నమెంట్ స్కూలుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మోరల్ వాల్యూస్, సామాజిక బాధ్యత అవగాహన కల్పిస్తూ.. ట్రైనింగ్ ఇచ్చి అడ్వాన్స్ టెక్నాలజీతో విద్యార్థులు ముందుకు వెళ్లేవిధంగా ఎన్విరాన్మెంట్ ఫౌండేషన్ వాళ్లు కంప్లీట్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ రెండు నెలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే ఐటీ కంపెనీ సంస్థ నుంచి విద్యార్థులకు కంప్యూటర్ ట్రైనింగ్ రెండు నెలల పాటు ఇస్తారన్నారు. విద్యార్థులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో సమాజంతో పోటీ పడే విధంగా తయారు చేస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చడిస్తూ.. మంచిగా చదువుకుంటున్నారా.. భోజనం మంచిగా పెడుతున్నారా? గుడ్లు ఇస్తున్నారా, నాన్‌వెజ్ పెడుతున్నారా అని అడిగి తెల్సుకున్నారు. అటు తర్వాత సైన్స్ ల్యాబ్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో నందకిషోర్ ప్రధానోపాధ్యాయులు, తదితర టీచర్లు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర





నవతెలంగాణ-సంగారెడ్డి

బీజేపీ, యువమోర్చా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి అధ్యక్షతన సంగారెడ్డి జిల్లా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో హర్ గర్ తిరంగా యాత్రలో భాగంగా ఐబి నుంచి కోర్టు వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చాహల్ జీ, యువమోర్చ రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ హాజరై మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంద్రాగస్టు సందర్భంగా ప్రతి భారతీయుడికి దేశం పట్ల గౌరవం, అంకిత భావం వివరిస్తూ వారికి వారి ఇండ్లపై జాతీయ జెండాను ఎగురవేసుకునేలా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ రాజు గౌడ్, కొండాపురం జగన్, ద్వారకా రవి, రవి శంకర్, విజయ్ కుమార్, కసిని వాసు, పవన్ ముదిరాజ్, నరేన్ దేశ్ పాండే, బీజేపీ నాయకులు , యువమోర్చా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీకి తరలిన జిన్నారం నేతలు

నవతెలంగాణ-జిన్నారం

ఘర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమానికి జిన్నారం మండలం నుంచి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రతాప్‌రెడ్డి, కొత్తకాపు జగన్‌రెడ్డి కార్యదర్శి సీతారాజు యాదవ్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

కొత్తపల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-గుమ్మడిదల



మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ తొలి దశ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. మాజీ ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కొలను బాల్‌రెడ్డి, మండల నాయకులు, రాష్ట్ర రజక సంఘం నాయకులు తదితరులు ముఖ్య అతిథిగా పాల్గొన్ని ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలిదశ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గ్రామాల్లో స్వతంత్ర సమరయోధులను గుర్తు చేసుకుంటూ ఆమె విగ్రహం ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు మండల రాష్ట్ర నాయకులు హాజరైనందుకు పేరుపేరునా ఉద్యమాభివందనాలు తెలిపారు. వీర వనిత చిట్యాల చాకలి ఐలమ్మ విగ్రహన్ని గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషదాయకమని రజక సంఘం మండలాధ్యక్షుడు మామిండ్ల వీరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రజక సంఘం అధ్యక్షులు కిష్టంగారి జితయ్య, గణేశ్, గ్రామ రజక సంఘం అధ్యక్షులు మామిండ్ల మురళి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల పెద్ద కృష్ణ, మామిండ్ల దుర్గేష్ గ్రామ రజకులు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

146 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-జోగిపేట



అక్రమంగా తరలిస్తున్న 146 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు ఆదివారం పట్టుకున్నారు. అక్రమంగా పీడీఎస్ రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం సివిల్ సప్లై డిపార్ట్మెంట్ డీటీసీఎస్ హేమంత్ ఆధ్వర్యంలో అందోల్ మండలం సంగుపేట గ్రామ శివారు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో డీసీఎం వ్యానులో అక్రమంగా తరలిస్తున్న 146 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాదు నుంచి బెంగుళూరు వైపు వెళుతున్నట్లు డ్రైవర్ జాకిర్ తెలిపినట్లు హేమంత్ వివరించారు. ఈ మేరకు బియ్యాన్ని జోగిపేట సివిల్ సప్లై గోదాం ఇన్చార్జ్ సత్యంకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వాహనం యజమాని సతీష్, డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో పోలీస్ కానిస్టేబుల్ వేణుగోపాల్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-మనూర్



మండలంలోని బెల్లాపూర్ గ్రామ పంచాయతీకి సంబంధించి బదిలీపై వెళ్తున్న, అలాగే నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శులను మాజీ సర్పంచ్ కే.దిగంబర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కాగా ఇక్కడ గత పదేండ్లుగా కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ ఇటీవలే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బీరప్ప విధుల్లో చేరారు. కాగా వారిని మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, గ్రామ నాయకులు సంగారెడ్డి, వెంకటరెడ్డి, దత్తు, బీరప్ప, మాజీ వార్డ్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో నిలిచిన జియో సేవలు



- కరెంటు పోతే ఫోన్ నెట్వర్క్ బంద్

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గజ్వేల్ మండలం బయ్యారం గ్రామంలో జియో సేవలతో గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఇటీవల జియో నెట్వర్క్‌కు సంబంధించిన టవర్ వేయడంతో గ్రామస్తులు మూకుమ్మడిగా జియో సిమ్ములు తీసుకున్నారు. గత మూడు నెలలుగా గ్రామంలో జియో సేవలో అంతరాయం ఏర్పడుతుంది. దీంతో వినియోగదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై గజ్వేల్ పట్టణంలో ఉన్న జియో ఆఫీస్‌కి వెళ్లి సేవలను పునరుద్ధరించాలని కోరామని గ్రామస్తులు తెలిపారు. మూడు నెలలు గడుస్తున్నా సేవల అంతరాయం మాత్రం అలాగే ఉందని గ్రామస్తులు వాపోయారు. కరెంటు ఉన్నంతసేపు జియో సిమ్ములు పనిచేస్తున్నాయని కరెంటు పోతే సిమ్ములు పనిచేయక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గజ్వేల్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో టవర్ వేశారనే ఉద్దేశంతో సిమ్ములు తీసుకొని ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. ఇప్పటికైనా జియో సిబ్బంది గ్రామానికి వచ్చి నెట్వర్క్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



సీఎంఆర్ఎఫ్ చెక్కులు నిరుపేద కుటుంబాలకు వరం లాంటిదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మండల పరిధిలోని పెద్ద గుండవెల్లి గ్రామానికి చెందిన దండు లక్ష్మి సద్ది పుష్ప, నక్కల మల్లయ్య, శివరాత్రి శాలవ్వ, మల్లయ్యలకు రూ.1,33,500ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద గుండవెల్లి బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లుగారి ప్రేమ్, నక్కల రాఘవరెడ్డి, గంట అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

చిన్న చిన్న వానలకే చెరువును తలపిస్తున్న ప్రధాన రోడ్డు

- రోడ్డు మీద నడవడంలోను నిత్యం ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్లు





నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు చిన్న చిన్న వానలకే చెరువును తలపిస్తున్నది. నిత్యం ఈ రోడ్డు మీద రద్దీగా ఉంటుంది. నల్లపోచమ్మ దేవాలయానికి ప్రతి రోజు రోజు పర్యాటకులు, భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు వస్తూ పోతుంటారు. ఈ రోడ్డుపై నడిచేందుకు వీలు లేకుండా పోయింది. రోడ్డు బురద మయమవుతోంది. వాహనాలు వెళ్లేందుకు తాత్కాలికంగా చిప్ పొడి వేసి పనులు చేపట్టి, ముగించడం గమనార్హం. మాజీ మంత్రి హరీశ్ రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట జిల్లా ఏర్పడిన తర్వాత హైదరాబాద్ ప్రధాన రహదారి వద్ద నిర్మించిన నూతన కలెక్టరేట్, సీపీ కార్యాలయాలకు సౌకర్యవంతంగా వెళ్లడానికి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని నంగునూరు, మద్దూరు, కోహెడ, ధూళ్మిట్ట, హుస్నాబాద్ మండలాల్లోని ప్రజలు త్వరగా చేరుకునే విధంగా ఈ రోడ్డు ఉపయోగపడుతోంది. ధూళ్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామం నుంచి నంగునూరు మండల కేంద్రం మీదుగా నూతనంగా రెండు వరుసల రోడ్డు నిర్మించడానికి నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ల, అధికారుల నిర్లక్ష్యం మూలంగా నంగునూరు మండల కేంద్రంలో 200 మీటర్లు రోడ్డు వేయకుండానే పనులు ముగించారని తెలిసింది. దీంతో నంగునూరు మండల కేంద్రం గుండా వెళ్లేందుకు ప్రజలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది నంగునూరు బస్టాండ్ సమీపంలో ఉన్న వైన్స్ దుకాణలను నల్ల పోచమ్మ దేవాలయం వెళ్ళే రోడ్డు మార్గంలో వెలిసింది. నిత్యం వైన్స్ వెళ్ళేవారి ఇబ్బందులు అంతా ఇంతా కాదు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నంగునూరు మండల కేంద్రంలోని గ్రామ ఇలవేల్పు నల్లపోచమ్మ తల్లి దేవాలయానికి, కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్ళేదారిలో చింతల కిష్టయ్య (సినిమా టాకీస్) ఇంటి వద్ద చిన్న వర్షం పడగానే చెరువును తలపిస్తుంది. ప్రధాన రోడ్డుపై నిత్యం బురద మయమవుతున్నా గ్రామ పంచాయితీ సెక్రటరీ, ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. అంక్షాపూర్ నుంచి నంగునూరు బీటీ రోడ్డు మరమ్మతులు చేసిన కాంట్రాక్టరు సైతం 200 మీటర్ల దూరంలో ఉన్న ఈ రోడ్డు నిర్మాణం పనులు చేయకుండానే ముగించారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి ప్రధాన రోడ్డు ద్వారా కొమురవెల్లి మీదుగా హైదరాబాద్, చేర్యాల, గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌తో పాటు నర్మెట ద్వారా సిద్దిపేట, కలెక్టరేట్ వరకు వెళ్ళడానికి చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రావణ మాసంలో జరుగుతున్న శుభకార్యాలకు గ్రామస్తులు అమ్మవార్లకు సమర్పించే బోనాలతో నల్లపోచమ్మ తల్లి వారికి మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని వెళ్లాలంటే బురుద నీటి నుంచి వెళ్ళడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు సైతం తాము జేసీబీ సమకూర్చుతామని, మరికొందరు ట్రాక్టర్లను అందిస్తామని వాట్సాప్, సోషల్ మీడియాలో తెలుపుతున్నారు. అవి చూసినప్పటికీ ఎవరు మాత్రం పట్టించుకోవడంలేదు. అధికారులైన చొరవ చూపి కనీసం ముందుగా సైడు డ్రైనేజీ కట్టి రోడ్డు నిర్మించాలని, కాంట్రాక్టర్లు త్వరగా పని పూర్తి చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్న బీఆర్ఎస్

నవతెలంగాణ-సిద్దిపేట



ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ సంపూర్ణంగా స్వాగతిస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారని, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు సందులపురం రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా సర్వేశ్వర ఆలయ పాలకమండలి సభ్యులు పెరిక నాగరాజు, పొన్నాల నవీన్, నాయిని రాజమల్లు, స్వామి, కనకయ్య, శ్రావణ్, దినేశ్, కనకయ్యలు కలిశారు.

టీ టైమ్ ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన స్వామి గౌడ్ టీ టైమ్‌ను ఆదివారం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, భూంపల్లి ఎంపిటిసి అబ్బుల ఉమారాణి బాలా గౌడ్, తాజా మాజీ సర్పంచ్లు గుండా శంకర్, మధు, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు యాదవ్, మహిళా మండల అధ్యక్షురాలు కూతురి సుమలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మెర శ్రీధర్, బాల్తే వెంకటేశం, ఉత్తం నరేష్, పాతూరి భూపాల్ రెడ్డి, షేర్ పల్లి స్వామి, హనుమంత్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు కూతురి చందు, ఎల్లన, సురేందర్ రెడ్డి, పర్స నర్సింలు, రెడ్డి బాల్ నర్స్, దుబ్బరాజు, జంగి బిక్షపతి, రాజు, పరశురాములు, చరణ్ గౌడ్ తదితరులున్నారు.

ప్రభుత్వం ప్రత్యేక చీఫ్ సెక్రటరీని కలిసిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-ములుగు



సిద్దిపేట జిల్లా ములుగు మండల బీజేపీ నాయకులు ఆదివారం తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక.చీఫ్ సెక్రటరీ తెలంగాణ ప్రభుత్వం, రెవెన్యూ ఎక్సైజ్, కస్టమ్స్, ఫైనాన్స్ అధికారి సునీల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. గజ్వేల్ బిజెపి నాయకులు చింతల అరుణ్ కుమార్ రెడ్డి,ములుగు మండల్ బిజెపి కో కన్వీనర్ సత్యం యాదవ్ తదితరులు ఉన్నారు.

ఉన్నత శిఖరాల అదిరోహణ' స్వేరోస్' సంకల్పం

- స్వేరోస్ ఫైలాన్ శంకుస్థాపనలో ఓరుగంటి

నవతెలంగాణ-బెజ్జంకి



బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యవైపు నడిపించి ఎవరెస్ట్ శిఖరాన్ని అదిరోహించే సంకల్పాన్ని కల్పించిన ఘనత 'స్వేరోస్'దని రాష్ట్ర ఆహార భద్రత మండలి సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణం వద్ద చేపట్టనున్న 'స్వేరోస్'ఫైలాన్ నిర్మాణానికి రాష్ట్ర ఆహార భద్రత మండలి సభ్యుడు ఓరుగంటి ఆనంద్ స్వేరోస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొర్ర సురేశ్ కుమార్, జిల్లాధ్యక్షుడు ఉప్పులేటి బాబు, అంబేడ్కర్ యువజన సంఘం టౌన్ అధ్యక్షుడు బోనగిరి కొత్త రాజ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.స్వేరోస్ ఫైలాన్ నిర్మాణం ఉన్నత విద్యకు చిహ్నంగా మండలంలో నిలువాలని ఓరుగంటి ఆనంద్ అకాక్షించారు.స్వేరోస్ నాయకులు జేరిపోతుల బాబు,బోనగిరి ఆనంద్, కాంపెల్లి జీవన్,రాఘవ నవనీత్ కుమార్,బోయిని సంపత్, రామంచ శేఖర్, కనగండ్ల ప్రశాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పదవులు బాధ్యతతో కూడుకున్నవి

- రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ములుగు



పదవులు బాధ్యతతో కూడుకున్నవని జాతి శ్రేయస్సు కొరకు వాడాలని జాతి అభివృద్ధికి నిరంతరం పనిచేయాలని ఐక్యతతో ముందుకు సాగాలని గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షులు ఎల్లేష్ తెలిపారు. ఆదివారం ములుగు మండల రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాము, శ్రీధర్ లు మాట్లాడుతూ మనందరికీ స్ఫూర్తి ప్రదాత తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆమె అడుగుజాడల్లో నడిచి రజకుల శ్రేయస్సు కొరకు పాటుపడాలన్నారు. మనం సమాజంలో ఎదగాలంటే విద్యా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఎందుకు అందరు సహకరించాలని తెలియజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులుగా భూమన్న కనకరాజు ఉపాధ్యక్షులుగా జూపల్లి నరహరి సిహెచ్ రాజు ప్రధాన కార్యదర్శి రాచకొండ శ్రీకాంత్ సహాయ కార్యదర్శి పి భాస్కర్ కోశాధికారిగా భూంపల్లి శ్రీనివాస్ ఎల్ ఆంజనేయులు ఎన్నికయ్యారు. గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎల్లేష్, ప్రధాన కార్యదర్శులు రాముగారి శ్రీధర్, కోశాధికారి నరసింహులు,వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు ములుగు మండల రజక సంఘం నూతన అధ్యక్షులు భూమన్న కనకరాజు మాట్లాడుతూ తన బాధ్యతలను నిర్వర్తిస్తూ మండల రజక సభ్యులందరికీ మేలు చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ అవకాశాన్నిచ్చిన ప్రతి రజక సోదరునికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడ్డ కార్యవర్గ సభ్యులతో పాటు గజ్వేల్ ప్రతినిధిగా రాము, శివరాజయ్య జగదేవ్పూర్ ప్రతినిధులుగా నరసింహులు, యాదగిరి, సీనియర్ రిపోర్టర్ బాల నరసయ్య, శ్రీనివాస్, చిట్యాల దుర్గయ్య, వివిధ గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి స్నేహితుల అండ

నవతెలంగాణ-మద్దూరు



స్నేహితుని కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. తమ తోటి చదువుకున్న చిన్ననాటి స్నేహి తుడు మీసా నరసింహులు ఇటీవల అకాల మరణం చెందాడు. దీంతో స్నేహితుని కుటుంబానికి మేమున్నామంటూ చిన్ననాటి స్నేహితులు నరసింహులు కూతురు పేరు మీద పోస్ట్ ఆఫీస్‌లో కిసాన్ వికాస్ పత్రు పథకంలో రూ.55వేలు ఫిక్స్ డిపాజిట్ చేసి. స్నేహితుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూళ్మిట్ట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2004-05 పదో తరగతి వరకు తమతోటి చదువుకున్న లింగాపూర్ గ్రామానికి చెందిన మీసా నరసింహులు మృతు చెందడం బాధాకరమన్నారు. నర్సింహులు కుటుంబానికి తామంతా అండగా ఉంటామన్నారు.

ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

- గజ్వేల్ డివిజన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కొంకా ప్రణయ్ కోనేరు ప్రవీణ్ ఎన్నిక



నవతెలంగాణ-గజ్వేల్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గజ్వేల్ డివిజన్ నూతన కమిటిని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత సమావేశంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రంజిత్ రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు విచ్చలవిడిగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకునే నాథుడు లేకుండా పోయారన్నారు. గజ్వేల్ లో గ్రామాలకు బస్సు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ ప్రాంతంలో విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జిలు చెల్లించాలని, పుస్తకాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాంక్ అకౌంట్లు ఇవ్వాలని, విద్య రంగ సమస్య పరిష్కరించాలని కోరారు. బాయ్స్ గర్ల్స్ హబ్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాట్లు చేయాలని, వాచ్మెన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి, గజ్వేల్ విస్తృత సాయి సమావేశంలో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కమిటీ నూతన కమిటీని ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులుగా కోనేరు ప్రవీణ్.. కొంక ప్రణయ్ ఎన్నికవ్వడం జరిగింది నూతన కమిటీని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రంజిత్ రెడ్డి నూతన కమిటీకి కృతజ్ఞతలు చెప్పారు. గజ్వేల్ విద్యారంగ సమస్యలపైన నూతన కమిటీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు వంశీ ప్రవీణ్, లోకేష్ రాజశేఖర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

చింతమడకను అభివృద్ధి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ఇల్లు కూలగొట్టి గుడిసెల్లో ఉంచారు
- పది ఏళ్లు అధికారంలో ఉన్న పూర్తికాని నిర్మాణాలు
- చింతమడకలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

పునర్నిర్మాణంలో భాగంగా చింతమడక గ్రామాన్ని అభివృద్ధి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక గ్రామంలో హరికృష్ణ సమక్షంలో సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతమడక గ్రామంలో పునః నిర్మాణంలో భాగంగా ఇల్లు రాని వారు ఎలాంటి అధైర్య పడవద్దని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో ఇల్లు కోల్పోయి నిర్వాసితులైన పథకంలో ఇండ్లు నిర్మిస్తామన్నారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి గ్రామానికి కావలసిన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ విఫలమై ఇబ్బందులు పడుతున్న బాధితుల కోసం ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అదేవిధంగా జిల్లా ఇన్చార్జి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే బాధితులకు అండగా నిలుస్తామన్నారు. ప్రతి అర్హుడికి ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. మంత్రి పొంగులేటి స్పందనకు తామే కారణమంటూ ఎమ్మెల్యే హరీష్ రావు చెప్పుకుంటూ రావడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలు కళ్ళు తెరవాలని పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ నాయకులు అంజిరెడ్డి, సదాశివరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు కిషన్, వనజ, నాయకులు సత్యనారాయణ, బాబు, చందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

మహిళా సమస్యలపై ఉద్యమిస్తాం

- ఐద్వా మాసభలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సింగిరెడ్డి నవీన, అత్తిలి శారద



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

రానున్న కాలంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమిస్తామని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సింగిరెడ్డి నవీన, అత్తిని శారదలు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో అర్బన్ మండల ప్రథమ మహాసభ దండు లక్ష్మీ అధ్యక్షతన జరగగా, జెండా ఆవిష్కరణ జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన కావించారు. అనంతరం జరిగిన మహాసభలో అధ్యక్ష, కార్యదర్శులు సింగిరెడ్డి నవీన, అత్తిని శారదలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా మహిళలకు అన్నింటిలో అన్యాయం జరుగుతుందన్నారు. ఈ రోజు మహిళలు పట్టపగలే రోడ్డు మీద తిరిగే పరిస్థితి లేదన్నారు. ఎక్కడ చూసినా అత్యాచారాలు అఘాయిత్యాలతో దేశం తల్లడిల్లుతుందని, వీటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని వారన్నారు. సమాజంలో సగభాగమైన మహిళలకు అన్నిట్లో 50% రిజర్వేషన్ ఉండాల్సింది పోయి ఈ రోజు చట్టసభల్లో 33 శాతానికే పరిమితం చేసి అది కూడా పార్లమెంటు లోక్‌సభ ఎన్నికల్లో 2029 నుంచి అమలు చేస్తామనడం సిగ్గుమాలిన చర్య అన్నారు. 50% చేయాల్సిన రిజర్వేషన్ 33 శాతానికి కుదించి మహిళలకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు అలాగే అఘాయిత్యాలు, అత్యాచారాలను అరికట్టేందుకు చట్టాలను పటిష్టం చేయాల్సింది పోయి అధికారంలో ఉన్నవాళ్లే మహిళలను కించపరిచే విధంగా చూడడం సబబు కాదన్నారు. రాబోయే కాలంలో ఇలాంటి వివక్షతకు గురి చేస్తే ఊరుకునేది లేదని ఉద్యమిస్తామని హెచ్చరించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ మహిళలకు పెద్దపీట వేస్తామని భారత్ మాతాకు జై అంటూ నినదించేవాళ్లు ఈ రోజు మహిళలను కించపరిచే పద్ధతిలో వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వాటిని అరికట్టాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రాకముందు మహిళలకు మహాలక్ష్మి పేరుతో రూ.2500 వేలు ప్రతి మహిళకు ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయట్లేదన్నారు. అలాగే 28వ ఉచిత 200 యూనిట్లు ఉచిత కరెంటు అని చెప్పి ఎక్కడ అది అమలు పర్చట్లేదన్నారు. దాన్ని కూడా అందరికీ అమలు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని వారికి ఇండ్లు ఇవ్వాలని కొత్త రేషన్ కార్డులకు వెంటనే అవకాశం కల్పించాలని కోరారు. వృద్ధాప్య, వికలాంగుల, వితంతు పెన్షన్లు పెంచి ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఐద్వా జిల్లా నాయకురాలు జాలిగపు శిరీష మాట్లాడారు.

నూతన కమిటి ఎన్నిక

అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా మండల అధ్యక్షురాలుగా బెల్లి రాజమణి, కార్యదర్శిగా దండు లక్ష్మి, ఉపాధ్యక్షులుగా మద్దెల లక్ష్మి, చెప్యాల బాలమణి, రేణుక, సహాయ కార్యదర్శులుగా బైరోజు హరిత, కొంచెం సుజాత, ఖాతాలక్ష్మి మండల కమిటీ సభ్యులుగా రాజేశ్వరి, మంజుల కవిత, స్వరూప లక్ష్మి, ఉమామహేశ్వరి, నరసవ్వ, పద్మ, గంగవ్వ, స్వప్నలను ఎన్నుకున్నారు.

తంజీముల్ మజీద్ కమిటీ చైర్మన్‌గా సయ్యద్ మతిన్ ఘన విజయం

- స్థానిక ఎన్నికలు తలదన్నే రీతిలో అభ్యర్థుల విస్తృత ప్రచారం
- సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తా

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్





ప్రతిష్టాత్మకంగా జరిగిన గజ్వేల్ పట్టణ తంజీముల్ మజీద్ కమిటీ ఎన్నికల్లో సయ్యద్ మతీన్ ఘనవిజయం సాధించారు. గత వారం రోజులుగా స్థానిక సంస్థల ఎన్నికలను తలదన్నే రీతిలో అభ్యర్థులు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించారు. కాగా ఆదివారం పట్టణ పాత మజీద్ వద్ద పోలింగ్ నిర్వహించగా, మజీద్ కమిటీ అధ్యక్షునిగా సయ్యద్ మతిన్ 1143 ఓట్లు సాధించి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో సయ్యద్ మతిన్, హైదర్ ఎక్బాల్‌లు పోటీ పడ్డారు. మొత్తం 1203 ఓట్లకు గాను, సయ్యద్ మతిన్ ఆటో గుర్తుకు 1143 ఓట్లు పడ్డాయి. సమీప ప్రత్యర్థి హైదర్ ఎగ్బాల్‌కు 54 ఓట్లు రాగా, 6 ఓట్లు చెల్లనివిగా ఎన్నికల అధికారులు గుర్తించారు. కాగా మజీద్ కమిటీ అధ్యక్షునిగా ఎన్నికైన సయ్యద్ మతిన్ మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ మైనారిటీ ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని, వివిధ మజీద్‌లలో అసంపూర్తి పనులను పూర్తి చేస్తానన్నారు. అంతే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సహకారంతో పేద ముస్లిం సోదరుల ఆర్థికకాభివృద్ధి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మజీద్ కమిటీ మాజీ చైర్మన్లు సాజిద్ బేగ్, ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ యూసుపొద్దీన్, జాఫర్ ఖాన్, నాయకులు జహీర్, రియాజ్, గౌసుద్దీన్, సమీర్, సర్దార్ ఖాన్, ఆరిఫ్, వజీర్ ఖాన్, శివారెడ్డి, రాములు గౌడ్, సందీప్ రెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

- ఎంఈఎఫ్ డివిజన్ సమావేశంలో ప్రతినిధులు



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాకలో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయడం కోసం ఎంఈఎఫ్ దుబ్బాక డివిజన్ సమావేశాన్ని ఆదివారం దుబ్బాక మండల అధ్యక్షులు ఇస్తారిగల్ల పవన్ , జిల్లా ఉపాధ్యక్షులు బొంబాయి శ్రీనివాస్ నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశ ముఖ్య అతిథి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పరపల్లి నాగభూషణం మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి మంద కృష్ణ మాదిగ నిరంతర కృషి, పట్టుదల, ఎందరో మాదిగ బిడ్డల త్యాగ ఫలితంగా వర్గీకరణ రాష్ట్రాలే చేసుకోవచ్చని, ఏ,బి, సి, డి వర్గీకరణకు మార్గాన్ని సుగమం చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలురించిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా , ఉద్యోగ రంగాలలో తొందరగా వర్గీకరణ అమలు చేసి మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలనీ కోరారు. అనంతరం మాదిగ ఉద్యోగుల సమాఖ్య సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మరాఠీ సంతోష్ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల ఆరాధ్యుడు, గత 30 ఏండ్ల నుంచి ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా లక్ష్యం వైపే గురి పెట్టి అస్త్రాన్ని సంధించి లక్ష్యాన్ని ఛేదించిన మేధావన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆపద్బాంధవుడు, మచ్చ లేని మనిషి మంద కృష్ణమాదిగ అని పేర్కొన్నారు. ఈ నెల 13 తేదీన ఢిల్లీ నుంచి మన రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా మందకృష్ణ మాదిగ కు ఘన స్వాగతం పలుకుతూ చేపట్టే విజయోత్సవ కార్యక్రమాన్ని దుబ్బాక నియోజక వర్గం నుంచి ఎక్కువ మంది పాల్గొనాలని సూచించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెక్కపల్లి పద్మయ్య మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ దండోరా ఉద్యమ ఫలితంగానే రాష్ట్ర స్థాయిలో మాదిగలకు గుర్తింపు వచ్చిందని, మంద కృష్ణ మాదిగ మన మాదిగ జాతి పిత అని కొనియాడారు. కార్యక్రమాల్లో చేర్యాల మండల ఎంఈఎఫ్ అధ్యక్షులు చదరపల్లి నరేష్, దుబ్బాక మండల నాయకులు రాజు , యాదగిరి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ప్రతినిధులు ఇస్తారిగల్ల స్వామి, వంశీ, దొమ్మాట ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

4

సోమవారం | 12 ఆగస్టు 2024 | www.navatelangana.com

ప్రతి ఇంటి మీద త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

స్వాతంత్ర దినోత్సవం ఆగస్టు 15న ప్రతి ఒక్కరు జాతీయ జెండాలను ఎగురవేయాలని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు కోరారు. ముచ్చటైన మన మూడు రంగులంజెండాను మన ఇంటిపై ఎగరవేసి ప్రతి ఒక్కరు కూడ దేశభక్తి చాటాలన్నారు. ప్రతి వ్యక్తిలోనూ దేశభక్తి ఉప్పొంగాలన్నారు. భిన్నత్వంలో, ఏకత్వం మన దేశం అన్నారు. సర్వ మతాలకు మన దేశం పుట్టినిల్లన్నారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతకాన్ని ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అమృత క్లినిక్ అధినేత వేములవాడ కనకచారి, రాజకుమార్, భాస్కర్, మల్లేశం, లక్ష్మీ నర్సయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

నూతన వధూవరులను చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వదించారు. ఆదివారం తుక్కాపూర్ కాంగ్రెస్ నాయకులు లింగాల వెంకటేష్ కుమారుడు నర్సింలు లింగాల స్వామి కుమార్తె పావని సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో వివాహం జరిగింది. ఈ వివాహానికి హాజరైన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గందారి లత నరేందర్ రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఊళ్లేంగల సాయి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, నాయకులు రమేష్, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు త్వరలోనే మోక్షం



నవతెలంగాణ-గజ్వేల్

రియల్ వ్యాపారం జోరుగా పుంజు కోవడంతో జిల్లాలో కొందరు రియల్టర్లు ధనార్జనే లక్ష్యంగా ముందుకు సాగారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో అమాయకులు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుదారుల ఎదురుచూపులు ఫలించనున్నాయి. మరో మూడు నెలల్లో సమస్య పరిష్కారం కానుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి లబ్ధి చేకూరనుంది.

గత ప్రభుత్వ హయాంలో పూర్తికాని ప్రక్రియ

కొనుగోలుదారులకు వెసులుబాటు కల్పించేందుకు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తీసుకురావటంతో జిల్లాలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, చేర్యాల, దుబ్బాక, హుస్నా బాద్ తదితర మున్సిపల్ పరిధిలో దాదాపు 56 వేల మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 2020 ఆగస్టు 31 వరకు దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరించాలని గత ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇవ్వగా ప్రక్రియ చేపట్టారు. అయితే మున్సిపాలిటీలో సిబ్బంది సరిగా లేకపోవటం, సూక్ష్మస్థాయిలో పరిశీలించాల్సి రావడంతో అనుకున్నంత వేగంగా సాగలేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటి వరకు 2500 వరకు దరఖాస్తులు పరిశీలించి మంజూరు ఫైల్స్ అందజేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గత డిసెంబరులో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గత జనవరిలో జాతీయ రియల్ ఎస్టేట్ అభివృద్ధి కౌన్సిల్ ప్రతి నిధుల సమావేశం సందర్భంగా ఎల్ఆర్ఎస్ సమస్య పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. తదుపరి చర్యల్లో భాగంగా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన వెలువరించటంతో దరఖాస్తుదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. సుమారు 100 గజాలున్న ప్లాట్లు రెగ్యులరైజ్ చేయించుకోవాలంటే రిజిస్ట్రేషన్ విలువను బట్టి మొత్తంగా రూ.28 వేల వరకు చెల్లించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్లో భూముల ధరలు బట్టి మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. మూడు దశల్లో పరిశీలించి పరిష్కరించనున్నారు.

బండ్ల ఇంటికి వచ్చిన బుల్లితెర నటుడు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి ఇంటికి ఆదివారం బుల్లితెర నటుడు బాంబే శ్రీనివాస్ వచ్చారు. గతంలో పరిచయం ఉండడంతో ఇంటికి వచ్చినట్లు బండ్ల స్వామి తెలిపారు. చిత్రపరిశ్రమ, బుల్లితెర పరిశ్రమ విషయాలను చర్చించుకున్నట్లు ఆయన అన్నారు. ప్రస్తుతం బాంబే శ్రీనివాస్ పలు చిత్రాలలో ,బుల్లితెర సంబంధించిన సీరియల్లో నటిస్తున్నట్లు తెలిపారు. శుభకార్యానికి గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా ఇక్కడికి వచ్చినట్లు బుల్లితెర నటుడు బాంబే శ్రీనివాస్ తెలిపారు.

ఒకే చోట సమావేశమైన పూర్వ విద్యార్థులు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 ఏడాదిలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట సమావేశమయ్యారు. వారికి చదువు చెప్పిన గురువుల సమక్షంలో యోగ క్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకొన్నారు. గత స్మృతులు స్మరించుకుంటూ నవ్వుతూ గడిపారు పూర్వ విద్యార్థి మంద మహేందర్ పాఠశాల అభివృద్ధి కోసం రూ.12 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, ప్రస్తుత మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు కొండిల్లా రాజు, కోల రాజు గౌడ్, సత్య ప్రకాష్, పాపిగారి నరేష్, కోల నరేష్, యూసుఫ్, కల్లూరి అశోక్, రేపాక రామ స్వామి, గాడిచర్ల సంపత్, దాసరి రజిత, కొండిల్ల రమాదేవి, ఎం.డి. నజియా, రజని, హారిక, శృతి తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలకాలి



నవతెలంగాణ-నంగునూరు

ఢిల్లీ కోట మీద విజయకేతనం ఎగురవేసి ఈ నెల 13న హైదరాబాద్ గడ్డ మీద కాలు పెడుతున్న ఎస్సీ వర్గీకరణ విజయ సారథి మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికేందుకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దేవులపల్లి కిష్టయ్య మాదిగ, జిల్లా సంయుక్త కార్యదర్శి ఆరెపల్లి కనకయ్య మాదిగ , జిల్లా సహాయ కార్యదర్శి కందికట్ల రాజు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో ఎన్నో ఆటంకాలను అవమానాలు ఒడిదొడుకులు నిర్బంధాలు ఓర్చుకొని ఆగష్టు 1న సుప్రీంకోర్టు తీర్పు చెప్పారన్నారు. ఎన్నో రోజుల ఆకాంక్ష, వర్గీకరణ అంశం విజయం సాధించడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. వర్గీకరణ పోరాటం మాదిగ జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు 13న ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలన్నారు.

టీ టైమ్ ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన స్వామి గౌడ్ టీ టైమ్‌ను ఆదివారం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, భూంపల్లి ఎంపిటిసి అబ్బుల ఉమారాణి బాలా గౌడ్, తాజా మాజీ సర్పంచ్లు గుండా శంకర్, మధు, మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు యాదవ్, మహిళా మండల అధ్యక్షురాలు కూతురి సుమలత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మెర శ్రీధర్, బాల్తే వెంకటేశం, ఉత్తం నరేష్, పాతూరి భూపాల్ రెడ్డి, షేర్ పల్లి స్వామి, హనుమంత్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు కూతురి చందు, ఎల్లన, సురేందర్ రెడ్డి, పర్స నర్సింలు, రెడ్డి బాల్ నర్స్, దుబ్బరాజు, జంగి బిక్షపతి, రాజు, పరశు రాములు, చరణ్ గౌడ్ తదితరులున్నారు..

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ దేవేందర్ రెడ్డి

- రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పులు చేసింది
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న హరీష్ రావు
- రుణమాఫీ అయ్యింది రాజీనామా ఏది?
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ దేవేందర్ రెడ్డి గ్రామస్తులతో కలిసి ఆదివారం పూజల హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రైతు రుణమాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఉపసర్పంచ్‌లు పిట్ల కనకయ్య, పాపవ్వ పాపయ్య వార్డు సభ్యులు గోపని చంద్రం, బట్ట వజ్రవ్వ, దేశెట్టి మల్లయ్య, కుంచం కిష్టయ్య, తరిగోపుల ఎల్లం, రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు జగన్ రెడ్డి, ఎర్ర సుధాకర్, మహిళలు 200 మందికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెంకటాపూర్ గ్రామానికి పాఠశాలకు రూ.16 లక్షలు, రెడ్డి సంఘం రూ.5 లక్షలు ముదిరాజ్ సంఘం రూ.6 లక్షలు రెండు లక్షలతో ఎల్ఇడి లైట్ మంజూరు చేసి ప్రజలకు నీటి సమస్య తీర్చడానికి రెండు బోర్లను వేయడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ, జీరో విద్యుత్ బిల్లు, మహిళలకు ఉచిత ప్రయాణం పది లక్షల బీమా సౌకర్యం పథకాలు అమలు చేసిందని రాబోయే రోజుల్లో అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ధీమాగా ఉంటుందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ నాయకులు గరిపల్లి రాములు, అంజిరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజ్ మహమ్మద్, బుస్సాపూర్ సర్పంచ్ సదాశివరెడ్డి, దుర్గయ్య, కృష్ణ, శ్రీకాంత్ మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పంటల సాగుకు మరింత మోక్షం

- గజ్వేల్ మాజీ ఎంపీటీసీ అక్కారం యాదగిరి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రాజెక్టులోకి నీరు విడుదల చేయడంతో పంట సాగుకు మరింత మోక్షమని గజ్వేల్ మండల మాజీ ఎంపీటీసీ అక్కారం యాదగిరి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కృషితో ప్రాజెక్టులోకి నీరు చేరిందని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతిపక్షాలు కావాలని విమర్శలకు దిగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతు సంక్షేమానికి కృషి చేయలేదని పేర్కొన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంద న్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం పనిగా పెట్టుకున్నాయని చెప్పారు. కొండపోచమ్మ మల్లన్న సాగర్ జలాశయంలోకి ప్రభుత్వం సాగు నీటిని విడుదల చేసిందని దీంతో రైతు కళ్ళల్లో ఆనందం నెలకొన్నదని ఆయన పేర్కొన్నారు.

నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయరా?

- బీడీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగారి వేణు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రాప్ లోన్ పేరుతో నెల రోజులుగా అకౌంట్ ఓల్డ్‌లో పెట్టడం వల్ల పింఛన్లు తీసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్రాప్ లోన్లకు పింఛన్లకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఆగస్టు లోపు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఇప్పుడు చేసిన రుణమాఫీ మళ్లీ రైతులకు యధావిధిగా మంజూరు చేయాలన్నారు. బ్యాంకుల చుట్టూ తిరగకుండా ఇవ్వాలని కోరాడు. కౌలు రైతులకు ఇస్తామన్న హామీ దృష్టి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే విద్యార్థులపై లాఠి చార్జీలు చూసే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీను అమలు చేసి ఇచ్చిన హామీలను నిరుపేద కుటుంబాలకు అందించే విధంగా కృషి చేయాలని కోరారు.

డాక్టర్ భాస్కర్‌కు వైద్య బ్రహ్మ బిరుదు ప్రధానం



నవతెలంగాణ-సిద్దిపేట

సికిందరాబాద్‌లోని హరి హరా కళా భవన్‌లో లలితకళా సమాఖ్య సేవా సామాజిక సంస్కృతా సంస్థ సిద్దిపేటకు చెందిన లోహిత్ సాయి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఏ భాస్కర్‌కు వైద్య బ్రహ్మ బిరుదును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేస్తున్న సామాజిక కార్యక్రమాలు, ఇప్పటి వరకు 100 ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు ఉచిత వైద్యము అందిస్తున్నందుకు ఆ బిరుదును, స్వర్ణ కంకణం, మెడల్‌తో సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో సంస్థ అధ్యక్షులు లయన్ విజయకుమార్, సెక్రటరీ మహేంద్రవాద వెంకటేశ్వరరావు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారని తెలిపారు.

పోటీ పరీక్షల్లో...సత్తా చాటే విద్యార్థులదే భవిష్యత్తు

- టివైఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం
- ప్రముఖ విద్యావేత్త ప్రసన్న హరికృష్ణ



నవతెలంగాణ-గజ్వేల్

మారుతున్న పరిస్థితుల్లో సత్తా చాటే విద్యార్థులకే చక్కటి భవిష్యత్తు ఉండగా, పోటీ పరీక్షల్లో సైతం నైపుణ్యత ప్రదర్శించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రముఖ విద్యావేత్త, పోటీ పరీక్షల శిక్షకులు ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని టివైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. సాంప్రదాయక విద్య కాకుండా పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని యూనివర్సిటీ కోర్సులు, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉన్నత విద్య, గ్రూప్ పరీక్షలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, కార్పొరేట్ సంస్థల ప్రవేశం తదితర అంశాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అంతేగాకుండా విద్యార్థులు, నిరుద్యోగులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్తే సాధించనిదంటూ ఏమి ఉండదని చెప్పారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, ఇందుకోసం తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన గజ్వేల్ పట్టణంలో నిరుద్యోగ యువతకు టీవైఆర్ ఫౌండేషన్ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కాగా ప్రముఖ న్యాయవాది, విద్యావేత్త తలకొక్కుల రాజు ఏర్పాటు చేసిన జాతీయస్థాయి విజ్ఞాన కేంద్రం చక్కటి ఫలితాలు అందించనుండగా, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీవైఆర్ నాలెడ్జ్ సెంటర్‌లో హైటెక్ టెక్నాలజీతో అత్యుత్తమ సేవలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రాజు మాట్లాడుతూ తాను చిన్న తనలో పడిన కష్టాలు నేటి తరం విద్యార్థులు పడకుండా ఉండాలన్నదే తమ లక్ష్యం కాగా, పేద విద్యార్థులకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు అనంత రామకృష్ణ, మహిపాల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, విజయలక్ష్మి శ్రీనివాస్, శివ సాగర్, సాదిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి హన్మంతరావును కలిసిన గాడిపల్లి అనూప్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తనయుడు కాంగ్రెస్ యువ నాయకుడు గాడిపల్లి అనూప్ జన్మదినం సందర్భంగా ఆదివారం హైదారాబాద్‌లో మైనంపల్లి హన్మంత రావును మర్యాద పూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ యువ నాయకుడు అనూప్‌కు మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అనూప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనూప్ మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా మైనంపల్లి హన్మంతరావును మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందిని, ఎంతో ఆప్యాయంగా పలకరించి తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఫారూక్ జానీ, తీగుల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన బాబాయ్‌ను చూసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో యువకుడు అదృశ్యమైన సంఘటన అక్బర్పేట్ భూంపల్లి మండల పరిధిలోని పోతరెడ్డి పేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. యువకుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం పోతరెడ్డి పేట గ్రామానికి చెందిన మ్యాదరి రఘు (17) రామాయంపేట్‌లో ఇంటర్ చదువుతున్నాడు. మ్యాదరి స్వామి (బాబాయ్) ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం శనివారం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రఘు తల్లిదండ్రులతో కలిసి చూసేందుకు వెళ్ళాడు. అయితే తిరుగు ప్రయాణంలో రఘు తల్లిదండ్రులు రామాయంపేట్ బస్సు ఎక్కగా, రఘు నర్సాపూర్ బస్సు ఎక్కాడు. టికెట్ తీసుకున్న సమయంలో రఘు అదృశ్యమైనట్లు గమనించి, రఘు కోసం కుటుంబీకులు, బంధువులు వెతికారు. రఘు హైదరాబాద్ వెళ్లేటప్పుడు రెడ్ టీ షర్ట్, బ్లాక్ కలర్ పాయింటు, తెలుపు మొఖం, చెవ్వకి రెండు రింగులు ధరించి ఉన్నట్లు బంధువులు తెలిపారు. యువకుడి వివరాలు తెలిస్తే 9505752303, 9849933034, 7780256137 నంబర్లకు సంప్రదించాలని కోరుతున్నారు.

ప్రతాప్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర అటవీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-రామాయంపేట

మృతుని కుటుంబానికి ప్రముఖ సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన కొంతల పల్లి కిష్టయ్య శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న గట్టు ప్రశాంత్ మృతుడి కుటుంబానికి రూ.4 వేలు ఆర్థిక సహాయం అందచేశాడు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. భూదయ్య, రమేష్, సాలమన్ రాములు, బాబు, రామస్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే



నవతెలంగాణ-తూప్రాన్

అధికారులు ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినప్పటికి ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తున్నది. మున్సిపాలిటీలో ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొని పలు వీధులను శుభ్రం చేస్తూ మొక్కలను నాటడం నాటారు. అయినా కూడా ఆదివారం ఐదో వార్డు లక్ష్మీ గార్డెన్ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి దర్శనమిస్తున్నది. మరి ఈ చెత్త ఎవరి దృష్టికి రాలేదా అని వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలా వార్డులలో చెత్త చెత్త పేరుకుపోయి దోమలు, క్రిమి కీటకాలు ఎక్కువై ప్రజలకు వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. 5వ వార్డును సందర్శించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వార్డు ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

వర్ధ కాలువలో పేరుకుపోయినమట్టి





నవతెలంగాణ-మెదక్ రూరల్

మంభోజీ పల్లి మల్లన్న చెరువులో వర్ధ కాలువలో పూడిక మట్టి పేరుకుపోయింది. దీంతో ఎగువ ప్రాంతం నుంచి వర్షం వర్ధకాలువలోకి వచ్చినప్పటికి మట్టి పేరుకుపోయి రైతులకు అందే పరిస్థితి లేదు. ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చిన తమ పోలాలకు నీరు చేరడం లేదని రైతు మ్యాకల దుర్గయ్య వాపోయారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టి వర్ధ కాలువలోని పూడిక మట్టిని త్వరగా తొలగించి మల్లన్న చెరువు ఆయకట్టు రైతులకు మేలు చేయాలని కోరారు. ....